# శ్రీ రాముడి పెళ్ళి

*ఆంధ్రప్రభ, 16-3-77*

---

**ప్రతి సంవత్సరం తనకి కళ్యాణం చేయమని రాముడు కోర్తాడా? ఆ ఖర్చుతో ఓ పేదపిల్ల పెళ్ళి జరిపితే.... దేవుడు హర్షించడా?....**

---

ఆనాటి అనాచ్ఛాదితమైన విభ్రాంతి తాలూకు అయోమయావస్థనుండి ఇంకా చైతన్యం జనించలేదు. కొన్ని వందల హృదయాల అశాంతికి రూపకల్పన చేసిన వ్యక్తి ఆవేశం తాలూకు ధైర్యం యింకా జారిపోలేదు.

నమ్మలేని నిజంతో స్పృహ కోల్పోయిన ఆమె అంతరాత్మ జ్ఞాపకశక్తిని మాత్రం యింకా కోల్పోలేదు.

* * * * *

"ఇంకా ఎప్పుడక్కా... దేవుగి పెళ్ళి?"

"అదుగో మొదలెడుతున్నట్లున్నారు."

"మనం వెళదామా?" ఆతృతగా అడుగుతున్న చెల్లెల్ని చిత్రంగా చూసింది సునీత.

"అక్కడకు మనం వెళ్ళేదేమిటి? పెళ్ళయ్యాక పెద్దిళ్ళకు దేవుడిని తీసుకొస్తారు."

"దేవుడు పెళ్ళి చేసుకుని మన ఆశీర్వాదం కొరకు వస్తాడా? పైగా మనది పెద్ద ఇల్లు కనుక వస్తాడా?"

సరిత కంఠంలో ఆశ్చర్యం వెనుక లీలగా ఆవేదన.

శ్రీరామనవమికి అక్కగారి వూరికి వచ్చిన సరితకు మరో లోకానికి వచ్చినట్లని పిస్తోంది.

"అదుగో ట్రాక్టరొచ్చేసిందమ్మా...." పదేళ్ళ అక్క కొడుకు సంబరంగా పరిగెట్టు కొచ్చాడు నిద్రకళ్ళను నులుముకుంటూ.

"ట్రాక్టరా? అదెందుకూ?" పన్నెండు గంటలవేళ దేవుడి ఊరేగింపు చూడడానికి ఆతృతగా ఎదురుచూస్తున్న సరిత ఆశ్చర్యంగా చూచింది.

"భలేదానివే పిన్నీ! మరి ట్రాక్టరుమీద డ్యాన్సులు చూడవూ, నువ్వు?"

"ట్రాక్టరుమీద డ్యాన్సులేంటిరా పిచ్చిమొద్దూ!"

ఇక పిన్నికి జవాబు చెప్పడం తన తరం కాదన్నట్టు అమ్మవైపు బేలగా చూసాడు వాడు.

"ఏంటి సునీతక్కా! నువ్వూ ఎందుకు నవ్వుతున్నావ్!"

"ఏమీ లేదులే.... ఒరే బాబీ పిన్నిని తీసుకెళ్ళరా డ్యాన్సు చూస్తుంది....!"

"నిజంగానా? నాకు చెప్పనేలేదే నువ్వు డ్యాన్సు ప్రోగ్రాం వుందనీ! ఏమిటి కూచిపూడా?"

మరలా నవ్వింది సునీత.

"చూద్దువుగానిలేవే! అంత ఆరాటపడతావెందుకు?"

హఠాత్తుగా బ్యాండుమేళం కాస్తా ఘోరమైన సినిమా పాటలోకి మారిపోయింది. ట్రాక్టరు స్టార్టయిన శబ్దం తాలూకు రణగొణ ధ్వని... ఎదురింటి గోడల మీద పదవిన్యాసం తాలూకు కదిలే నీడలు... ఆ నీడలను ఆత్రంగా చూచే క్రీనీడలు.... ట్రాక్టరు మెల్లిగా ఇంటి ముందు ఆగింది. ఆ ట్రాక్టరు తొట్టిలో పదహారేళ్ళ పసిపిల్ల కదిలేందుకు చోటులేక అక్కడక్కడే గెంతుతోంది. ఆ పిల్ల ఒంపుల తాలూకు విన్యాసాలలో.... నేర్పిస్తే మంచి నాట్యగత్తె అయ్యే సూచనలున్నాయి. కానీ, ఆ పిల్లను ఈ జనం ఎదగనీరు. అదే ట్రాక్టరుమీద సంవత్సరానికోసారి ఆ ఇరుకైన స్థలంలో 'సూదిలో దారం - సందులో బేరం' అంటూనో 'నా సొంపులన్నీ నీవే రా రా రా!' అంటూనో... అతి జుగుప్సాకరంగా ఆ రాత్రంతా గెంతి ఓ వందో, రెండొందలో పట్టుకెళ్ళి రాత్రికి నొప్పులు తగ్గడానికి నాటుసారా త్రాగి... జీవితమంతా అందులోనే మగ్గిపోవాల్సిందే.

"పోనీ... పోనీ ఓ చిన్న స్టేజీ ఏర్పరచి దానిమీద మంచి డాన్సులు చేయించ కూడదూ? యిదేమి అసహ్యమక్కా?" ఇక ఆ నాట్యం చూడలేక ఆ నాట్యగత్తె తాలూకు వివరాలు వినలేక అడిగింది.

"భలేదానివే! స్టేజీకట్టి అక్కడ డ్యాన్సులు చేయిస్తే, జనం అంతా అక్కడే పోగై పోరూ?... దేవుని ఊరేగింపులో మరెవరుంటారు?"

"దేవుడి పెళ్ళికోసం ఇంత ఆర్భాటం చేస్తున్నారు. దేవుని పెళ్ళిలో ఎవ్వరూ వుండరూ? అంటే... అంటే కేవలం ఈ డ్యాన్సులుకొరకు మాత్రమే జనం భగవంతుడి చుట్టూ చేర్తారా? భగవంతుని పెళ్ళికి అతిథులే కొరవవుతారా?"

"ఏంటో నువ్వు ప్రతిదానికీ విపరీతంగా ఆలోచిస్తావు. నీకు అసలు పద్దెనిమిదేళ్ళు వచ్చినా యిలాంటివేవీ యింతవరకు చూపించని అమ్మవాళ్ళని అనాలి."

అక్క చెప్పేది విన్పించుకోవడం లేదు సరిత. ప్రక్కనేవున్న అరుగుమీద కూర్చొంటూ నిదానంగా అంది.

పోనీ.... యిదివరకు దేవదాసీలనే వాళ్ళుండేవారట. అలా దేవుడి ఊరేగింపు ముందు భగవంతుణ్ణి ఆహ్వానిస్తూనో, ఆరాధిస్తూనో భరతనాట్యం పెడితే ఈ ప్రజలలో భక్తిభావమన్నా కలుగును. ఇదేమిటి? యువకులను వెర్రెత్తించి వాళ్ళ సంస్కారాన్ని కుదించడం కాకపోతే... ఇలాంటి నాట్యాలను మీరు ఆమోదిస్తున్నారంటే నాకు చిత్రంగా వుంది."

"నిజమే సరితా నేనూ నీతో ఏకీభవిస్తున్నాను."

ఉలిక్కిపడి వెనక్కు తిరిగి బావగార్ని చూచి తన వాచాలతకు క్షణం సిగ్గుపడిన సరిత వెంటనే తేరుకుంటూ అంది.

"అయితే బావగారూ! మీ ఉభయం రోజుకూడా ఇలానే జరుగుతుందా?"

నవ్వాడు కృష్ణమూర్తి.

"నువ్వు చిన్నపిల్లవు నీకు తెలియదు. ఉభయం మాదే అయినా... అనుభవం అందరిదీ... వాళ్ళకు నచ్చిన ప్రోగ్రామ్ నేను ఏర్పాటు చేయకపోతే.... నీకు అనుభవం లేదు సరితా! ఊరికి కళ వుండదు."

క్షణం ఆలోచిస్తూ వుండిపోయింది సరిత.

"కానీ బావా! మీలాంటివాళ్ళయినా పురోగమించకపోతే ఎలా?....."

"అంటే నీ ఉద్దేశం?" ప్రక్కనే వున్న కుర్చీ లాక్కుని కూర్చొన్నారాయన.

"ఓపెన్‌గా చెప్పాలంటే బావా నాకివన్నీ నచ్చలేదు."

"ఇవన్నీ అంటున్నావు దేవుడి పెళ్ళి కూడానా!" ఆశ్చర్యంగా అడుగుతున్న భార్యను నవ్వుతూ వారించాడు కృష్ణమూర్తి.

"నువ్వాగు చెప్పనీ."

కాస్త తటపటాయిస్తూ అంది సరిత.

"అసలు దేముడికి పెళ్ళెందుకు?"

"అవును! అసలే ఆయన ఏకపత్నీవ్రతుడు కూడాను" అప్పుడే వచ్చి కల్పించు కున్నాడు అక్క చిన్నమరిది శివమోహన్.

"నీకు తమాషాగా వుందే!" శివవైపు చురుగ్గా చూచింది సరిత.

"నేను ఏమన్నాను? పాపం రాముడికి మాటిమాటికి పెళ్ళేమిటి? అనే అంటు న్నాను." చిలిపిగా అన్నాడు శివ.

"నీతో నేను మాట్లాడలేదు."

"నువ్వు నాతో మాట్లాడకపోయినా నువ్వు మాట్లాడిన విషయం మాకు సంబంధించింది కనుక....." బూట్ల లేసులు సరిచేసుకుంటూ కళ్ళెత్తి కొంటెగా చూస్తున్నాడు.

"నీకు సంబంధించి విషయమా!"

"కాదా! ఎంచక్కా ట్రాక్టరు డ్యాన్సులున్నాయి కదా! అని కాలేజీకి శెలవు పెట్టి మరీ వచ్చినవాళ్ళం.... ఆ డ్యాన్సులు కాస్తా తీసెయ్యమని మా అన్నగారికి నువ్వు అర్జీ పెట్టుకుంటే మరి మాకు కోపంరాదూ!" కోపంగా ఫోజు పెట్టడానికి అవస్థలు పడుతున్న మరిదికేసి నవ్వుతూ చూసింది సునీత.

"అలా చెప్పవయ్యా మరిదీ.... ఇప్పుడీమె కొత్త పద్ధతులు పెడుతుందట... అందుకాయన సపోర్టు ఒకటి."

* * * * *

"అయ్యగారూ!"

ఆ విశాలమైన మండువాలో నాగరికత తాలూకు సోఫాల్లో జ్ఞాపకాల రాపిడిలో నలుగుతూ అచేతనంగా కూర్చొనున్న సరిత కృష్ణమూర్తితో పాటు వులిక్కిపడింది.

"ఏం రామయ్యా!"

"పోలీసులొచ్చారు బాబూ!"

"ఆఁ వస్తున్నాను. కూర్చోమని చెప్పు."

"ఆస్పత్రినుండి మనుషులు కూడా వచ్చినట్టున్నారయ్యా."

తను కూర్చోనున్న స్థలంనుండి ఒక్క సెంటీమీటరు కూడా కదలలేనిదానిలా బిగుసుకుపోయిన సరిత లేచి నిలబడ్డ బావగారివైపు బరువుగా కనురెప్పలెత్తి చూసింది. అదే క్షణంలో అతను కూడా మరదలివైపు ఓదార్పుగా చూసాడు.

"కాఫీ పంపించు."

అక్కడే గొణుగుతున్న భార్యతో అనేసి ఆయన వెళ్ళిపోయాడు.

"ఏమి జరుగుతుందో! ఏమి వినాల్సివస్తుందో."

"నేను చెప్తే విన్నారా? నీకేం తెలియదు.... 'నువ్వొత్త ఆడదానిలా ఆలోచిస్తావు' అన్నారు. ఇప్పుడేమయింది?"

"అక్కా!"

"కాదు మరీ! ఎంత చదువులు చదివినా పెద్దా చిన్నా ఎందుకు ఏర్పరిచారో ఎందుకు చెపుతున్నారో, కాస్త అర్థం చేసుకోవాలి." చేతిలో వున్న కాఫీపొడి డబ్బా విసురుగా వంటమనిషి కందించింది. సరిత మాట్లాడలేదు. ఆమె కళ్ళనీళ్ళు చెంపలమీదుగా జారిపోవడానికి సిద్ధంగా వున్నాయి.

"ఇప్పుడు ఏడిస్తే ఏం లాభం? నీ మూలంగా చూడు. మీ బావకు యెంత అప్రదిష్ట!"

"వదినా!" కొన్ని నిముషాలక్రితం ఆ వార్త విని టాక్సీలో వచ్చిన శివమోహన్ సునీతను వారించాడు.

కనురెప్పలెత్తి శివమోహన్ కళ్ళలోకి కొంత ఆసరా కొరకు చూసి చప్పున తల వంచుకుంది సరిత.

"అనండయ్యా! అప్పుడూ మీరంతా కలిసి నన్నే అన్నారు. ఇప్పుడూ అంటున్నారు. కానీ నా మాట ఆనాడు మీరు వినుండుంటే యింత అనర్థం యీనాడు జరిగేదా?"

"అవును. నువ్వు చెప్పింది నిజం అక్కా!" యిక నిగ్రహించుకోలేని సరిత వెక్కిళ్ళతో.... శివమోహన్ చైతన్యం తెచ్చుకున్నాడు.

"చూడు.... చూడు సరితా యిప్పుడేమయిందనీ.... లే... లే.... లేచి మొహం కడుక్కుని రా. టాక్సీ అలాగే వుంది. వూరెళ్దాం రా."

వెక్కిళ్ళ మధ్యగా అంది సరిత "నేననుకోలేదు మోహన్ వీళ్ళింత మూర్ఖులని లేకపోతే.... లేకపోతే బావను బలవంతం చేసేదాన్ని కాదు."

"నువ్వు చేసిందేమీలేదు. మంచి చేయబోతే స్వీకరించని యీ మూర్ఖుల గురించి నువ్వు బాధపడనవసరం లేదులే."

ఆమె లేవలేదు. ఆమె లేస్తుందని క్షణం చూసిన శివమోహన్ చేతిలో పత్రిక ప్రక్కనపెట్టి ఆమె భుజంమీద సున్నితంగా ఎడమచేయి చుట్టి కుడిచేతిని ఆమె చేతికి ఆసరాగా యిచ్చి లేపాడు.

"నువ్వుండినా బాగుండేది. నా ఖర్మ కాబోలు. యీ సంవత్సరమే నువ్వు రాలేదు."

"ఛీ ఏమిటిలా బేలగా ఆలోచిస్తావ్ సరితా!......"

"నేనుంటేమటుకు నేనేం చేయగలిగేవాడిని! వాళ్ళ కొమ్మ వాళ్ళే నరుక్కుంటుంటే,,,, చెప్పు మనం వాళ్ళకు చేయగలిగేదేముంట్నుందంటావు?"

వెర్రిగా చూస్తోంది సరిత.

"ఇంకెందుకు ఏడవడం? వెళ్ళు. వెళ్ళి పళ్ళు తోముకురా టిఫిన్ తిందువుగాని" సునీత తొందరగా కోలుకుని పనిలోకి వెళ్ళిపోయింది.

"మోహన్! ఏమయ్యుంటుందంటావ్! వాడు... వాడు..."

మోహన్ మాట్లాడలేదు. ఆమెను బలవంతంగా బాత్‌రూమ్‌వైపు నడిపించుకుని వెళ్ళాడు.

ముఖం కడుక్కుంటూ కడుక్కుంటూ ఆగిపోయింది సరిత.

ఆ రోజు... ఆ రోజు... తనా కోరిక కోరకుండా వుండుంటే... కాలచక్రం వెనక్కు తిరిగి తనకా అవకాశం మరొక్కసారివ్వగల్గితే...

ఆమె ముఖంమీదనుండి నీళ్ళు మెడమీదుగా జారిపోతున్నాయి. ఆమె జ్ఞాపకాలు మనసు పొరలమీద దొర్లిపోతున్నాయి.

* * * * *

"అయితే.... అయితే ఏమంటావయితే ఇంతకీ నువ్వు."

"చెప్పమంటావా? నువ్వు నవ్వకూడదు మరి" సంకోచంగా శివమోహన్‌వైపు చూచింది సరిత.

"నవ్వొస్తే...."

"నువ్వుండు శివా! తనని మాట్లాడనీ... చెప్పమ్మా, దేముడి పెళ్ళి ఎలా చేస్తే బావుంటుందంటావ్!"

ఆమె కొన్ని నిముషాలు మాట్లాడలేదు.

"అసలు యీ దేముడి పెళ్ళికి ఎంత ఖర్చవుతుంది బావా!"

"రెండు వేలు"

"రెండు వేలే!"

సరిత ఆశ్చర్యపోతుంటే శివమోహన్ ఆమెను అనుకరిస్తూ అన్నాడు.

"రెండు వేలే! ఏమ్మా! మనుషుల పెళ్ళికే వేలకు వేలవుతుంటే పాపం ఆ మాత్రం దశరథ మహారాజు పుత్రుడు శ్రీరాముడు... తన పెళ్ళికి ఖర్చు పెట్టుకోలేడూ!"

చురుగ్గా చూసింది సరిత.

"బావా! ఈ రోషం లేనివాళ్ళతో నాకేమి పనిగాని మీరు..."

"చెప్పమ్మా"

"రెండువేలు ఖర్చుపెట్టి శ్రీరాముడి పెళ్ళి చేయకపోతే శ్రీరామనవమి రోజు శ్రీరాముడి ఆశీర్వాదంతో ఒక పేద పిల్ల పెళ్ళి జరిపించకూడదూ!"

"నిజమేనమ్మా!" కృష్ణారెడ్డి కాసేపు ఆగాడు. "కానీ సరితా! యీ కోలాహలమంతా పల్లెప్రజలకు ఏడాదికొకసారయినా కాస్త వికాసం కొరకు పెట్టుకున్నది... పట్నంలోలాగ వీళ్ళకు సరదాలంటూ ఎక్కువగా ఏమీ వుండవు. ఏడాది పొడవునా యీ నవమి కొరకు ఎదురుచూసే జనం నిరాశపడతారేమో!"

"నిరాశపడకుండా మనం వాళ్ళకొరకు ఆ పెళ్ళి తర్వాత కొన్ని ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తాము. బాలనాగమ్మ నాటకానికి వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టకుండా యీ వూరి యువకులంతా కలిసి రిహార్సల్స్ వేసుకుని మంచి సాంఘిక ప్రయోజనాత్మకమైన నాటకం వెయ్యొచ్చు. యీ వూర్లో పదేళ్ళలోపు ఆడపిల్లలకు డాన్సు నేర్పించి... ఆ పూచీ నేను తీసుకుంటాను. వాళ్ళచేత డాన్సు వేయించొచ్చు. అక్క అన్నట్లు కేవలం ట్రాక్టరు డ్యాన్సులకొరకేగా ఈ జనం భగవంతుని పెళ్ళికి కోకొల్లలుగా వస్తున్నది.... ఆ రోజు యీ డ్రామాకొరకు డ్యాన్సులకొరకు మనం చేయబోయే ఒక పేదపిల్ల పెళ్ళికి రాక పోతారా? అప్పుడు మీ పల్లెప్రజల సరదా తీరుతుంది. మీ రెండు వేలు సార్ధకమవుతాయి."

కృష్ణారెడ్డితోపాటు శివమోహన్ కూడా శ్రద్ధగా విన్నాడు.

సునీత మూతి తిప్పింది.

"చాలు చాల్లే. శ్రీరాముడి పెళ్ళికి బదులు బీదవాళ్ళ పెళ్ళి చేస్తుందట. కొద్దిగా కూడా పాపం పుణ్యం లేదమ్మా యీ పిల్లకు."

"నిజమే... నిజమే ప్రయత్నించి చూద్దాం వచ్చే సంవత్సరం" కృష్ణారెడ్డి సాలోచనగా అన్నాడు.

బావగారి అంగీకారానికి ఆమె ముఖం వికసించింది.

ఆ ఆనందంలో తన తగువు మాట మర్చిపోయి మెరిసే కళ్ళతో శివమోహన్ వైపు చూస్తూ అంది.

"ఏం మోహన్! ఐడియా ఎలా వుంది?"

అతను ఏదో లోకంనుండి వచ్చినట్లు తృళ్ళిపడ్డాడు.

"ఆఁ.... ఆ బాగానే వుంది. అమ్మాయిగారితోపాటు మా అందరికీ బడిత పూజ తప్పదన్నమాట."

"నిన్ను అడగడం నా బుద్ధితక్కువ కాదూ?" సరిత చేంపలేసుకుంది.

"అవునవును మంచి చెప్పేవాళ్ళంతా బుద్ధిలేనివాళ్ళే... నీతోపాటు ఆయన తాళం ఒకటి. మతిలేకపోతే సరి. నలుగురు పెద్దలూ... ఏమంటావ్?" అంది సునీత.

"నువ్వు కాస్త నోరు మూసుకుందూ!"

* * * * *

"ఆనాడు నా నోరు మూసారు యీనాడు మూయండి ప్రజల నోర్లు... నేనూ చూస్తాను" గొణుక్కుంటూ వడ్డిస్తున్న సునీతను తప్పించుకుంటూ టిఫిన్ ప్లేట్ దగ్గర నుండి లేవబోయిన సరితను వారించి తనూ ప్రక్కన కూర్చొని ఆమెచేత టిఫిన్ తినిపిస్తున్న శివమోహన్‌ను ఎంతో ఆత్మీయంగా చూసింది సరిత.

అతని బలవంతంమీద టిఫిన్ ఆగిఆగి తింటున్న ఆమె మనసును జరిగిన సంఘటనలు వదలడం లేదు.

* * * * *

'మా పిల్లలేం భోగం పిల్లలు కాదు. స్టేజీలెక్కి డ్యాన్సులు చేయడానికి.'

'పదేళ్ళ పిల్లలు డ్యాన్సులు చేస్తే భోగం పిల్లలవుతారా!'

'ఒరే!... డ్రామా గీమా అన్నావంటే చంపేస్తాను జాగ్రత్త.'

'అంకయ్య కూతురు పెళ్ళికి మీరంతా రావాలి.'

'ఆఁ వస్తానులే అమ్మా'

ఇలా అనే తీరులో వాళ్ళ నిరసన కొట్టొచ్చినట్లు కన్పించింది. కొందరు ముసలాళ్ళు వుండబట్టలేక ముఖాన్నే అడిగేశారు.

'ఏం పిల్లా! శ్రీరాముడికి పెళ్ళి లేదటగా యీ సంవత్సరం. అయినా ఇదేం పోయేకాలం దాపురించిందీ.....'

'అవ్వగారూ! శ్రీరాముడు యీ పెళ్ళికి తప్పకుండా సంతోషిస్తాడు. ఆయన తన బిడ్డల పెళ్ళికి అసూయపడ్తాడా?'

'నువ్వూరుకోరాదా! ముసలిదానివై మంచానపడ్డాక కూడా యావపోలేదు!' అత్తగారిమీద కోడలి కసురులో సరితకు తగిలిన విసురు లేకపోలేదు.

అన్ని నిష్ఠూరాలను భరించిన సరిత... కృష్ణారెడ్డి.... ఒక పేదపిల్ల పెళ్ళి ఏర్పాట్లన్నీ ఘనంగానే చేసారు. పిల్లవాడికీ పిల్లకు గుడ్డలు కొనిచ్చారు. పేదలకు అన్నాలు కూడా ఏర్పాటు చేసారు. డ్యాన్సు ప్రోగ్రాం విఫలమయింది. కానీ ఉత్సాహమున్న కొందరు యువకులు డ్రామా మాత్రం వేయబోతున్నారు.

నిరాశలనన్నిటినీ తట్టుకుని ఇంట్లో ప్రచ్ఛన్న యుద్ధానికి కూడా తలపడి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది.

ఆ రోజు ఘోరమైన విషాదాన్ని మోసుకొచ్చింది. పెళ్ళిపీటలమీద పెళ్ళి కొడుకు గుండెలనుండి పారిన రక్తంలో స్పృహతప్పిన పడిపోయిన పెళ్ళికూతుర్ని మాత్రమే మిగిల్చింది.

"దేవుడి పెళ్ళిని కాదని వీడు పెళ్ళి చేసుకుంటాడా?" ఇదీ అందరి దుర్గ... విచారమేమంటే గొప్పవాళ్ళ సరదాల సంగతి వదిలేసినా తమ గూడెంలో సంవత్సరానికి ఒకరు ఉద్ధరించబడబోతుంటే వాళ్ళు... వాళ్ళూ ఈ హత్య చేసింది. ఈ హత్య చేసిన మనిషి ఒక్కడే అయినా ఆ హత్య వెనుక కుట్రదారులు చాలామంది.

'శ్రీరాముడి పెళ్ళి ప్రతి సంవత్సరం యిలా విఘ్నమయితే మనకు పుట్టగతు లుంటాయా! వీరిగాడు మంచిపని చేసాడు' హత్యా స్థలంలోని మాటలివి.

* * * * *

"సునీతా."

ఒక్క వుదుటున లేచి ఎంగిలి చేత్తోనే బావకు యెదురెళ్ళింది సరిత.

"ఏమయింది... ఏమయింది బావా!"

"చెప్పు.... చెప్పు బావా ఏమయింది?"

"వాడు.... వాడు...." తర్వాత బావ నోటివెంట రాబోయే వార్తకొరకు ప్రాణాలు బిగబట్టుకుని, కనురెప్పలార్పకుండా చూస్తోంది సరిత. బావ నోట తను కోరే శుభవార్త వస్తే చాలు..... ఈ జన్మకు చాలు. ఆమె ఆలోచన అల్లాడిపోతోంది.

"...... చచ్చిపోయాడు."

"చచ్చిపోయాడా?"

ప్రాణం ఎగిరిపోతున్నట్లుంది.... కాళ్ళకు పక్షవాతం వచ్చినట్లుంది.... ఒకేసారి పది ఫెథిడిన్‌లు పొడిపంచుకున్నట్లు కళ్ళు మూసుకుపోతున్నాయి. ఆమె తూలిపోతోంది. కృష్ణారెడ్డి తనతో వచ్చినవాళ్ళతో మాట్లాడుతున్నాడు. అంతదూరాన నిలబడి నిశ్శబ్దంగా వాళ్ళ సంభాషణ వింటున్న శివమోహన్ ఒక్క అంగలో ఆమెనఠ చేరి ఆమెను పట్టుకుని లోపలకు తీసుకెళ్ళాడు.

"మీరెళ్ళండి. నేనిప్పుడే వస్తాను" ఆతృతగా లోపలికొచ్చాడు కృష్ణారెడ్డి.

* * * * *

అప్పుడే కళ్ళు తెరచి అయోమయంగా చూస్తోంది సరిత.

"ఏమయిందమ్మా సరితా!... ఇప్పుడు బాగుందా!"

ఆమె ప్రక్కనే కూర్చొని, నిదానంగా చూస్తున్న శివమోహన్ లేచి నిలబడ్డాడు.

"బావా!.... బావా! నన్ను క్షమించండి. నా పాపానికి పరిహారం... నేననుకోలేదు యిలా జరుగుతుందని. పాపం ఆ అమ్మాయి... కొత్త పెళ్ళికూతురు... నన్నేం చేసినా పాపం లేదు".....అయోమయావస్థలో గొణుగుతోంది.

కృష్ణారెడ్డి ఆమె కోలుకునేవరకు ఆమెను మాట్లాడనిచ్చాడు. ఆ తర్వాత ఆమె అర్థం చేసుకోగలదనుకున్నాక మెల్లగా స్థిరంగా చెప్పాడు.

"ఒక అభ్యుదయం రావాలంటే దాని పాదాలముందు కొంత బలి జరిగితీరాలి సరితా. అది యీనాడు జరిగిపోయిందమ్మా."

"అంటే... అంటే..."

"వచ్చే సంవత్సరం కూడా ఇలాంటి పెళ్ళే చేస్తాను. ఎవరడ్డువస్తారో చూస్తాను. యిది ఆ డబ్బు నా స్వవిషయం."

"బావా!"

"అవునమ్మా.... నా కోరికలన్నీ తీరితే నా కల ఫలిస్తే వచ్చే సంవత్సరం చేయ బోయే పెళ్ళి మరలా యీ పిల్లదే అవుతుంది. నాకు నమ్మకముంది.... అప్పటికి జనంలో కూడా కొంత మార్పు వస్తుంది." ఆయన అవేశంతో ఆయాసపడుతున్నారు.

శివమోహన్, సరిత ఆయనకేసి ఆరాధనగా చూస్తున్నారు.

"పడుకోమ్మా సరితా! మనం చేయగలిగిన దానిగురించి ఆలోచించాలి. జరిగి పోయినదానిగురించి, తిరిగిరానిదానిగురించి ఆలోచించీ... చూడు నీ మనసు పాడు చేసుకోకు. సరితకు కాఫీ ఇవ్వరా శివా!" అనేసి వాళ్ళిద్దరినీ ఏకాంతానికి వదిలేసి వెళ్ళిపోయాడు కృష్ణారెడ్డి.